క్లుప్తంగా

తాళ్ల చెరువు ప్రాజెక్టు పరిశీలన


పరిశీలిస్తున్న డీఈ రవికుమార్

సాక్షి ఎఫెక్ట్..

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామశివారులో గల తాళ్లచెరువు ప్రాజెక్టును నీటిపారుదలశాఖ డీఈ రవికుమార్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 10న సాక్షి దినపత్రికలో 'యాసంగి సాగుపై రైతన్న ఆందోళన' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన నీటిపారుదలశాఖ డీఈ తాళ్లచెరువు ప్రాజెక్టును పరిశీలించారు. తూము వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయని, వాటిని తొలగించి మరమ్మతు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు.

మండలస్థాయి క్రీడాపోటీలు


క్రీడాకారులతో ఎస్సై వెంకట్రావ్

కొడిమ్యాల: స్వామీ వివేకానంద జయంతిని పురస్కరించుకుని మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీహైస్కూల్ మైదానంలో మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించారు. రన్నింగ్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై వెంకట్రావ్, పోలీసు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణపై శ్రద్ధచూపాలి


శిక్షణ ఇస్తున్న సీడీపీవో నర్సింగరాణి

పెగడపల్లి: నవజాత శిశువుల సంరక్షణ, బలహీనతపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో నర్సింగరాణి సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లుకు రెండురోజుల పాటు నిర్వహించిన లెర్నింగ్ అప్రోచ్ (ఐఎల్‌ఏ) శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా ఐఎల్‌ఏ మాడ్యూల్ 11 నుంచి 14 వరకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ లక్ష్మన్, హెల్త్ సూపర్‌వైజర్ తార పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే


సర్వే చేస్తున్న పంచాయతీ అధికారి

జగిత్యాలరూరల్: పట్టణ శివారులోని నూకపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న 33, 34వ వార్డుల్లో మంగళవారం జగిత్యాల మండల పంచాయతీ అధికారి కందుకూరి రవిబాబు ఇంటింటా సర్వే నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ గంగలక్ష్మి, మమత, వార్డు అధికారులు భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంగ్లంలో నైపుణ్యం తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్సై శ్వేత

పెగడపల్లి: విద్యార్థులు ఆంగ్లభాషలో తప్పనిసరిగా నైపుణ్యం సాధించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్, ఎస్సై శ్వేత అన్నారు. ఈ మేరకు పెగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌సీఈఆర్‌టీ, ఇంగ్లిష్ భాషా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ అంశాల్లో ప్రతి ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థుల చొప్పున పాల్గొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, హెచ్‌ఎం లచ్చయ్య, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్లాట్ రద్దయినా.. డబ్బులు రాలే

- ధరణి పోర్టల్‌లో దరఖాస్తు రద్దు చేసుకున్నా.. తప్పని ఎదురుచూపులు
- రెవెన్యూ కార్యాలయాలు, మీసేవ చుట్టూ తిరుగుతున్న బాధితులు
- రుసుము తిరిగి ఇవ్వాలని వినతి



ధరణి పోర్టల్

పెగడపల్లి: ధరణి పోర్టల్ ద్వారా భూ క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని అనివార్య కారణాలతో స్లాట్ రద్దు చేసుకుంటే అందుకు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ కింద చెల్లించిన రుసుం తిరిగి రావడం లేదు. దీంతో వాటికోసం బాధిత రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 'ధరణి' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో వ్యవసాయ భూముల లావాదేవీలు జరిపేందుకు ప్రభుత్వం ఈ విధానం అమల్లోకి తెచ్చింది. ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసేలా సాంకేతిక ఏర్పాట్లు చేసి సేవలు ప్రారంభించారు.

వివాదాలు తగ్గించడానికి..

ఈ సేవలు ప్రారంభమైన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ భూములు, క్రయ, విక్రయ లావాదేవీల్లో వారసత్వంగా భూమి బదలాయింపు వంటి అంశాల్లో పారదర్శకత పెరిగి వివాదాలు తగ్గుతాయని భావించిన ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్, వారసత్వ ఆస్తిమార్పిడి కోసం రైతులు మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. భూముల ధరలను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజును నిర్ణయించారు.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు..

స్లాట్ బుకింగ్ చేసుకున్న కొందరు అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు వెళ్లలేకపోతున్నారు. తగాదాలు, ఆర్థిక వ్యవహారాలు, ఇతర కారణాలతో బుక్ చేసుకున్న స్లాట్‌లు రద్దవుతుంటాయి. నిర్దేశించిన సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే మళ్లీ స్లాట్‌బుక్ చేసుకోవాల్సి వస్తుంది. స్లాట్ బుకింగ్ సమయంలో రైతులు తమ ఆధార్ నంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలు చెప్తారు. స్లాట్ రద్దు చేసుకున్నందుకు మినహాయింపులు పోనూ రిజిస్ట్రేషన్‌లకు చెల్లించిన ఛార్జీలను తిరిగి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ధరణి ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు రద్దయిన స్లాట్‌లకు సంబంధించిన డబ్బులు తిరిగి రాలేదు. మండలంలో సుమారు 60 స్లాట్స్ రద్దు అయ్యాయని, రూ. 6లక్షల నుంచి రూ.8లక్షల వరకు డబ్బులు రావాల్సి ఉందని సమాచారం. డబ్బుల కోసం వారంతా నిత్యం రెవెన్యూ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. నేరుగా ప్రభుత్వమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని అధికారులు చెప్పి పంపిస్తున్నారు. బకాయిలు విడుదల చేయాలని స్లాట్ రద్దు చేసుకున్న రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఏడాదైనా రాలేదు



నేను భూమి పట్టా కోసం మీసేవలో స్లాట్ బుక్ చేసుకున్న. ఇందుకు ప్రభుత్వానికి రూ.6వేలు చెల్లించిన. అనివార్య కారణాలతో బుక్ చేసుకున్న స్లాట్‌ను రద్దు చేసుకుని చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని మీసేవ నుంచి దరఖాస్తు చేసుకున్న. ఏడాది దాటినా నేటికీ నా డబ్బులు రాలేదు. మీసేవ, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగితే ప్రభుత్వం విడుదల చేస్తే మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెబుతుండ్రు.

– లైశెట్టి లక్ష్మి, దీకొండ

రూ.26వేలు రావాలి



నేను గ్రామంలో కొన్న భూమిని పట్టా చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకున్న. ఇందుకు ప్రభుత్వానికి రూ.26వేలు కట్టిన. అయితే కొన్ని ఇబ్బందులతో బుక్ చేసిన స్లాట్‌ను రద్దు చేసుకున్న. డబ్బుల వాపస్ కోసం అధికారులకు దరఖాస్తు పెట్టుకున్న. ఏడాది అవుతోంది అయినా డబ్బులు చేతికందలేదు. స్లాట్ బుక్‌చేసి రద్దు చేసుకున్న రైతులకు వారు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలి.

– తాటిపర్తి ఆగవరెడ్డి, రైతు, బతికపల్లి

మా పరిధిలో లేదు



స్లాట్ రద్దు చేసుకున్న డబ్బులు చెల్లించే అంశం తహసీల్దార్ల పరిధిలో లేదు. స్లాట్ బుక్ చేసుకున్న సమయంలో రిజిస్ట్రేషన్ కోసం చెల్లిస్తున్న సొమ్ము ప్రభుత్వ అకౌంట్‌లోకి వెళ్తుంది. స్లాట్ రద్దు చేసుకున్న వారికి తిరిగి డబ్బులు చెల్లించే అంశం ప్రభుత్వమే నిర్ణయించాలి. మీసేవ ద్వారా మాకు వస్తున్న దరఖాస్తులను పై అధికారులకు పంపిస్తున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నేరుగా వారి ఖాతాల్లో జమ వుతాయి.

– కృష్ణచైతన్య, తహసీల్దార్, పెగడపల్లి

భగీరథ పనులు వెంటనే పూర్తి చేయాలి


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: నియోజకవర్గంలో మిషన్ భగీరథ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదేశించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం భగీరథ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను తెలుసుకొని వాటిని వేసవిలోపు పూర్తి చేయాలన్నారు. అలాగే లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతు చేపట్టాలని సూచించారు. వేసవిలో ప్రతీ గ్రామానికి, రెండు మున్సిపాలిటీల్లో భగీరథ నీటిని పూర్తిస్థాయిలో అందించేలా చూడాలన్నారు. సీఈ అమరేందర్, ఎస్సై రవీందర్, ఈఈ శేఖర్‌రెడ్డి, డీఈలు ప్రేమకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కోరుట్లరూరల్: పట్టణంలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పీసరి అశోక్, పాతర్ల నరేశ్, ప్రధాన కార్యదర్శి కోకిల కృష్ణ, ఉరుమడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి స్థలం మంజూరు చేయండి


మంత్రి ఈశ్వర్‌ను కలిసిన లయన్స్ క్లబ్ సభ్యులు

ధర్మపురి: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే వాటర్‌ప్లాంట్ కొరకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ పట్టణ లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం మంత్రి ఈశ్వర్‌ను కలిశారు. ఈ మేరకు కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాగా మంత్రి సానుకూలంగా స్పందించారని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. డా.రామకృష్ణ, వినోద్‌రావు, వెంకటేశ్వర్‌రావు, సొల్ల భీమన్న, శంకరయ్య, మోహన్‌రావు, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

రాగిజావతో ఆరోగ్యం


రాగిజావ పంపిణీ చేస్తున్న సర్పంచ్ లత

ఇబ్రహీంపట్నం: రాగిజావతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ నేమూరి లత అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కర్ణాటకకు చెందిన శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ విద్యార్థుల కోసం అందించిన రాగిజావను ఆమె పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు, ఎంపీటీసీ రాములు, హెచ్‌ఎం సుభాష్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ రవీందర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన


విద్యార్థులకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లె, తుంగూర్, కొల్వాయి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో మంగళవారం పరిశుభ్రత ఎలా పాటించాలి అన్నదానిపై యూనిసెఫ్ వలంటీర్లు మారంపల్లి శ్రావణి, శ్యామల అవగాహన కల్పించారు. హోప్ ఫర్ లైఫ్ వారి సౌజన్యంతో, యూనిసెఫ్ వలంటీర్లు సంయుక్తంగా 164 మంది బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ ఉచితంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి విరాళం


విరాళం అందిస్తున్న మహర్షి

మెట్‌పల్లి: గోదావరిఖనిలో హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమానికి పట్టణానికి చెందిన నిఖిల్ భరత్ హైస్కూల్ కరస్పాండెంట్ భృగు మహర్షి విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం నిర్వాహకులకు రూ.25వేలు అందించారు. కాగా విరాళం అందించిన ఆయనకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

✦ రజక సంఘం భవనానికి రూ.5లక్షలు

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి గ్రామ రజక సంఘం భవన నిర్మాణం కోసం రూ.5లక్షలు మంత్రి ఈశ్వర్ మంజూరు చేశారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాన్ని మంత్రి మంగళవారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రజక సంఘం నాయకులకు అందజేశారు. రజక సంఘం అధ్యక్షుడు రాగల్ల శంకరయ్య, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి, సంఘం నాయకులు రవి, శ్రీనివాస్, రాజయ్య, సతీశ్, రాజేశం పాల్గొన్నారు.

✦ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల: కొడిమ్యాల మండలం పూడూరులోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక నిర్వహణ పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సీహెచ్.బాలలింగం తెలిపారు. కొండగట్టు, తాటిపల్లి, తక్కళ్లపల్లి, మద్దుట్ల, రాంపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

✦ ఎత్తిపోతల పథకాల మరమ్మతుకు నిధులు

సారంగాపూర్: గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన నాలుగు ఎత్తిపోతల పథకాల మరమ్మతుకు రూ.2.73 కోట్లు మంజూరైనట్లు నీటిపారుదలశాఖ డీఈ చక్రూనాయక్ తెలిపారు. ఈ మేరకు బీర్‌పూర్ మండలంలోని మంగేళ ఎత్తిపోతల పథకానికి రూ.78.30 లక్షలు, రేకులపల్లి ఎత్తిపోతల పథకానికి రూ.85.56 లక్షలు, కమ్మునూర్ ఎత్తిపోతల పథకానికి రూ.58.90కోట్లు, రాయికల్ మండలం బోర్నపల్లి ఎత్తిపోతల పథకానికి రూ.55.85 లక్షలు మంజూరైనట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. పనులు ప్రారంభించి ఈ యాసంగికి పంట పొలాలకు నీరు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

✦ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

కొడిమ్యాల: కొడిమ్యాల పడమటివాడ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింగిరెడ్డి కిషన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పాశపు కిషన్‌రెడ్డి, రైటర్‌గా సామ సురేందర్‌రెడ్డి, క్యాషియర్‌గా బద్దం లచ్చిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బాపురెడ్డి వీరారెడ్డి, భూమ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, గంగారెడ్డి ఎన్నికయ్యారు.

✦ ప్రభుత్వ కార్యాలయాలకు గులాబీరంగు సరికాదు

కొడిమ్యాల: ప్రభుత్వ కార్యాలయాలకు బీఆర్‌ఎస్ పార్టీ రంగు అయిన గులాబీ రంగు వేయడం సరికాదని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జీవన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తక్షణమే గులాబీరంగును తొలగించాలని కోరారు.

✦ పూలే అవార్డు గ్రహీతకు సన్మానం

వెల్గటూర్: విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను వెల్గటూర్ ఎంఈవో బత్తుల భూమయ్యకు పూలే 2023 అవార్డు అందుకున్న సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్‌టీయూ వెల్గటూర్ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రవి, జిల్లా కార్యదర్శి లకుమల్ల సత్యం, మండల అధ్యక్షుడు నాగం రమేశ్, పాతగూడూర్ హెచ్‌ఎం లచ్చయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

కొడిమ్యాల: మండలంలోని సంద్రాలపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. హెచ్‌ఎం ఏనుగు ఆదిరెడ్డి, నాయకులు మల్లయ్య పాల్గొన్నారు.

అల్పాహారం అందించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న టీటీయూ నాయకులు

జగిత్యాల: పదో తరగతి విద్యార్థులకు సాయంకాలం ప్రత్యేక తరగతులలో అల్పాహారం అందించాలని కోరుతూ టీటీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ రవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) జిల్లా అధ్యక్షుడు ఎడమల జితేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరాంకుశం శ్రీదీప్, రాష్ట్ర బాధ్యులు గాదె శ్రీనివాస్, నసీమహమ్మద్ జిల్లా బాధ్యులు కరుణకుమార్, మండలోజు రవీందర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



కంకర తేలిన రోడ్డు.. తప్పని తిప్పలు

సారంగాపూర్: రోజురోజుకూ తారు రోడ్లు శిథిలమవుతున్నాయి. సారంగాపూర్-బట్టపల్లి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ శాఖ 2009లో తారురోడ్డు వేసింది. రోడ్డును ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం నిర్వహణ లేకపోవడంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రోడ్డు నాలుగు మీటర్ల పొడవులో చాలా చోట్ల రోడ్డుపై కంకర తేలింది. వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే జంకుతున్నారు. వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సారంగాపూర్, బీర్‌పూర్
ఫోన్ నంబర్: 94408 18883

ఆయిల్‌పామ్ సాగుకు సమాయత్తం


మార్కింగ్ చేస్తున్న హార్టికల్చర్ అధికారులు

కోరుట్లరూరల్: మండలంలో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. భూమిని చదును చేసి మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో ఆయిల్‌పామ్ మొక్కలు నాటేందుకు 5 ఎకరాల భూమిలో హార్టికల్చర్ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో గుంతలకు మార్కింగ్ చేశారు. గ్రామంలో 380 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొక్కల కోసం డీడీలు చెల్లించారని అధికారి తెలిపారు. అదేవిధంగా మండలంలో 380 ఎకరాల్లో 21,660 మొక్కల కోసం రైతులు డీడీలు చెల్లించారని, ఈ నెల 18 వరకు మొక్కలు పంపిణీ చేసి ప్లాంటేషన్ ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ దారిశెట్టి రాజేశ్, రైతు ఆడెపు అశోక్, ఉప సర్పంచ్ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వెంటనే పంపిణీ చేయాలి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: రేషన్‌బియ్యం పంపిణీలో జరుగుతున్న జాప్యంతో పండుగ పూట పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ గొల్లపల్లి మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. జనవరికి సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బియ్యం పంపిణీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సమన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిర్ర గంగాధర్, సరసాని తిరుపతిరెడ్డి, రేవల్ల సత్యనారాయణ, పురంశెట్టి వెంకటేశ్, ఎంపీటీసీ లక్ష్మన్, మాజీ సర్పంచ్ కాసారపు అరవింద్‌గౌడ్, నాయకులు చిర్ర దిలీప్, చెవులమద్ది గంగాధర్, రమేశ్, మహేశ్, నవీన్, ప్రవీన్ పాల్గొన్నారు.

యాత్రల కోసం అద్దెకు ఆర్టీసీ బస్సులు


యాత్రకు బయలుదేరిన దీక్షస్వాములు

మేడిపెల్లి: ఎటువంటి డిపాజిట్ లేకుండా యాత్రలకు, శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ లక్ష్మీప్రసన్న కోరారు. ఈ మేరకు మండలంలోని మన్నెగూడెం గ్రామం నుంచి మంగళవారం శబరిమల యాత్రకు బయలుదేరిన ఆర్టీసీ లగ్జరీ బస్సును డిపో మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షస్వాములతో కలిసి బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మెకానికల్ ఫోర్‌మెన్ తిరుపతి, ఎస్టీఐ వెంకటేశం, ఉద్యోగులు, గ్రామస్తులు, దీక్షస్వాములు పాల్గొన్నారు.

శబరిమలైకి దీక్షాస్వాములు

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన పలువురు దీక్షాస్వాములు మంగళవారం శబరిమల యాత్రకు తరలివెళ్లారు. 41 రోజుల మండల దీక్షలు పూర్తిచేసుకున్న అనంతరం గ్రామంలోని భక్తాంజనేయ దేవస్థానంలో పెండ్యాల బాలకృష్ణ గురుస్వామి మాలధారణ స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం ప్రత్యేక బస్సులో స్వాముల బృందం శబరియాత్రకు బయలుదేరారు.

జనవరి 26 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర


ధర్మపురి: మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి/కోరుట్లటౌన్/మల్లాపూర్/కోరుట్లరూరల్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/వెల్గటూర్/మెట్‌పల్లి: హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర 26 నుంచి నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ఈ యాత్ర కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం స్థానిక కార్యకర్తల, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కార్యక్రమం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో మండలస్థాయి నాయకుల నుంచి బూత్‌స్థాయి కార్యకర్త వరకు ప్రతిఒక్కరూ పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పథకాలను గడపగడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలని టీపీసీసీ నాయకులు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ 2023 క్యాలెండర్‌ను ఎంపీపీ జాజాల భీమేశ్వరి మంగళవారం ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు డి.శివకృష్ణ, జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్‌రావు, మండల ఉపాధ్యాయులు జగన్‌మోహన్, రజిత, కోశాధికారి వేణుగోపాల్, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, ఇస్పాత్ యాస్మిన్, మోహన్, నవీన్, రహీంమ్‌పాషా, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకటి, ఎంపీటీసీ తిమ్మణి రాములు, నాయకులు జగన్‌రావు, జేడి సుమన్ పాల్గొన్నారు.